క్లుప్తంగా

యోగా రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

ఇచ్ఛాపురం రూరల్: ఈనెల 21న జరగనున్న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్క మహిళా సంఘ సభ్యురాలు తోటి వారితో రిజిస్ట్రేషన్ చేయించాలని ఏపీఎం ప్రసాదరావు అన్నారు. గురువారం తేలుకుంచిలో స్వయం సహాయక సంఘాలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వార్షిక ఆర్థిక ప్రణాళిక జీవనోపాదుల ప్రణాళికను అనుసరించి సంఘ సమావేశాల సమయంలో ముఖ ఆధారిత గుర్తింపులు పూర్తి చేయాలన్నారు.

పిల్లల సమగ్ర అభివృద్ధికి ఈసీసీఈ



భవానీపురంలో ఈసీసీఈ కార్యక్రమం

ఇచ్ఛాపురం రూరల్: పిల్లల సమగ్ర అభివృద్ధిని పెంపొందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల్య సంరక్షణ విద్యా దినోత్సవం(ఈసీసీఈ) కార్యక్రమం చేపడుతున్నట్లు రూరల్ ఐసీడీఎస్ సీడీపీవో పి.నాగరాణి అన్నారు. గురువారం భవానీపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించడం, పిల్లల శ్రేయస్సును ఎలా నిర్ధారించాలో తెలియజేయడమే ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నీలవేణీ, కార్యకర్త బి.నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ తప్పనిసరి

టెక్కలి రూరల్: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని ఏఎస్ఐ వెంకటరమణ సూచించారు. స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు గురువారం చేపట్టారు. దీనిలో భాగంగా ద్విచక్ర వాహనాల రికార్డులు పరిశీలించి లైసెన్స్‌లు లేని వాహనదారులకు అపరాధ రుసుము విధించారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘ సభ్యుల కుటుంబ సభ్యులు

వజ్రపుకొత్తూరు: పూడి జగన్నాథపురం గ్రామానికి చెందిన దుమ్ము ఏకాంబరం ఇటీవల రైలు ప్రమాదానికి గురవ్వడంతో కుడి కాలికి తీవ్రగాయమై తెగిపోయింది. విషయం తెలుసుకున్న రష్యాలోని ఆంధ్ర మిత్రుల సంఘం సభ్యులు దున్న వల్లప్పగారి జోగారావు, బెజ్జి మోహన్, తామాడ చిరంజీవి, తిమ్మల మోహన్‌లు ఏకాంబరం వైద్య ఖర్చుల నిమిత్తం రూ.59 వేల ఆర్థిక సాయం అందించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు



కోటిలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పిరియా విజయ, నిమ్మన దాస్

సోంపేట: మండలంలోని బారువ గ్రామంలో ఉన్న కోటిలింగేశ్వర స్వామి దేవాలయ పునః ప్రతిష్టా మహోత్సవం, విగ్రహ ప్రతిష్టా మహోత్సవం, ధ్వజస్తంభారోహణ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్తు రామారావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ తదితరులు ప్రత్యేక పూజలు చేపట్టారు. వారితో పాటు సర్పంచ్ యర్ర రజని, పార్టీ నాయకులు ఇప్పిలి కృష్ణారావు, ధర్మారావు, మాధవరావు, సత్యం తదితరులు ఉన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కవిటి: మండలంలోని కుసుంపురంలో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా గ్రామస్తులు, ఆలయ అనువంశిక ధర్మకర్తల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు విశేష పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేశారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- గ్రామాల్లో ప్రజలకు అందని వైద్య సేవలు
- నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



వైద్యం.. దైన్యం

పేదల వైద్యంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రజలకు ఇంటి వద్దనే వైద్య సేవలందాలనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష పథకాలను తీసుకొచ్చారు. దీంతో పేదలకు అన్ని రకాల వైద్య సేవలు అందేవి. గ్రామాల్లోనే నెలకు సరిపడా మందులను వైద్యులు అందించేవారు. దీంతో పేద ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లకుండానే ఉచితంగా వైద్య సేవలు పొందేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వైద్య సేవలు గ్రామాల్లో అందడం లేదు. కనీసం సమయానికి ఆస్పత్రులకు రావాల్సిన వైద్యులు రాకపోతుండడంతో రోగులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఫలితంగా పేదవాడికి వైద్యం అందని ద్రాక్షగా మారింది.

– సాక్షి నెట్‌వర్క్



రోగులను వైద్య శిబిరానికి తీసుకొస్తున్న వలంటీర్లు (ఫైల్)

ఉచితంగా కళ్లద్దాలిచ్చారు



కళ్లు పరీక్షించుకోవాలంటే అటు సోంపేట ఆరోగ్యవరం, ఇటు బరంపురం వెళ్లాల్సిందే. నాడు నాకు కళ్లు మసకమసక అవుతున్న సమయంలో ఏమీ చేయాలో ఆలోచిస్తున్న పరిస్థితిలో మా ఊరు పెద్ద డాక్టర్లు వచ్చి ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. అప్పట్లో ఉచితంగా కళ్లద్దాలు సైతం ఇచ్చారు. చాలా సంతోషంగా అనిపించింది.

– ఆశి భాస్కరరెడ్డి, లొద్దపుట్టి, ఇచ్ఛాపురం మండలం

పేదలకు ఎంతో ఉపయోగం



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను గత ప్రభుత్వం నిర్వహించడంతో పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. వైద్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి వైద్య పరీక్షలు చేసి వారి ఆరోగ్య సమస్యలను నమోదు చేసేవారు. వీటితో పాటు వైద్య శిబిరాల్లో స్పెషలిస్టు వైద్యులచే పరీక్షించి ఆరోగ్య సమస్యలకు సంబంధించిన మందులను కూడా ఉచితంగా అందించేవారు. ప్రస్తుతం ఇటువంటి పరిస్థితి ఎక్కడా కనపడడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యం గురించి పట్టించుకోవడం లేదు. వీటితో పాటు మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన వైద్య సదుపాయాలు కూడా కల్పించలేకపోతోంది. దీంతో పేద ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– చాట్ల తిరుపతి, పురుషోత్తపురం, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ

గ్రామాలకు వైద్యులు వచ్చేవారు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిరోజూ గ్రామాలకు వైద్య సిబ్బంది వచ్చి ప్రజల ఆరోగ్యంపై వాకబు చేసేవారు. అంతే కాకుండా వైద్యులు సైతం గ్రామాలకు వచ్చి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకునేవారు. ఇప్పుడు అటువంటి పర్యవేక్షణ కనిపించడం లేదు.

– ఆర్.ఆంజనేయులు, తేలినీలాపురం, టెక్కలి మండలం



వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామంలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు (ఫైల్)



టెక్కలి: లింగాలవలస గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం(ఫైల్)

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ఎంతో బాగుండేది. వైద్య నిపుణులు గ్రామీణ ప్రాంతాలకు నేరుగా వెళ్లి అక్కడ ప్రజల ఆరోగ్యాన్ని పర్యవేక్షించేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఆ పరిస్థితి కనిపించడం లేదు.

– చింతాడ వరుణ్, వైఎస్సార్‌సీపీ డాక్టర్ సెల్ అధ్యక్షుడు, టెక్కలి నియోజకవర్గం

ఎంతో మేలు జరిగింది



కవిటి మండలంలో సువిశాలమైన మత్స్యకార తీరప్రాంత గ్రామాలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ పథకంతో ఎంతో మేలు జరిగింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మా మత్స్యకార గ్రామాల్లో వైద్యసేవలు అందని పరిస్థితి నెలకొంది. సంచార వైద్య సేవల ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని మళ్లీ కొనసాగించేలా చర్యలు తీసుకోవాలి.

– కె.మాధవరావు, పెద్ద కర్రివానిపాలెం, కవిటి మండలం

ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ ఉండేది



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల ఆరోగ్యంపై ఎంతో శ్రద్ధ చూపేవారు. ఇంటింటికీ వైద్యులు వచ్చి మరీ ఆరోగ్య పరిస్థితులు తెలుసుకునేవారు. అవసరమైనవారికి వైద్య సేవలు అందించేవారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి నెలకు సరిపడా మందులు అందజేసేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు.

– బి.భాస్కరరావు, కె.కొత్తూరు, టెక్కలి మండలం

పేదలకు మంచి జరిగింది



గత ప్రభుత్వంలో మాకు ఊరులోనే వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన మందులు ఇచ్చేవారు. దానివలన నాలాంటి పేదరాలికి ఎంతో మంచి జరిగింది. ఇప్పుడు ఆ సదుపాయం లేక తరచూ అనారోగ్యంతోనే ఉండాల్సి వస్తోంది. ప్రభుత్వం ఆ విధానం మళ్లీ తీసుకొస్తే బాగుండేది.

– కొమ్మా సాహూ, పాతవరక, కవిటి మండలం

ప్రతి ఇంటికీ వచ్చేవారు



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఉన్నటువంటి అన్ని వార్డుల్లో ప్రతీ ఇంటికి ఫ్యామిలీ డాక్టర్ వచ్చేవారు. ఎవరైనా ఇంట్లో బాగులేనివారు ఉన్నారేమో అని తనిఖీలు చేసి వైద్యం అందించేవారు. అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చి ఆరోగ్యశ్రీలో ఆపరేషన్లు జరిపించేవారు. అనంతరం పరిహారం అందించేవారు. ఇప్పుడు ప్రైవేటు వైద్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఇదివరకు అందే సేవలు మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి వస్తేనే అందుతాయని ఆశిస్తున్నాం.

– బదకల బాలమ్మ, పద్మనాభపురం, కాశీబుగ్గ

ప్రైవేటును ప్రోత్సహిస్తున్నారు



ప్రస్తుతం సీఎం చంద్రబాబు హయాంలో నాణ్యమైన ప్రభుత్వ వైద్య సేవలు అందడం లేదు. కనీసం ఆస్పత్రికి వైద్యులు సమయానికి రాని పరిస్థితి నెలకొంది. అధికారుల నిర్లక్ష్య ధోరణితో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఏ చిన్న వైద్యానికి ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లినా పరీక్షలకే వేలల్లో వసూలు చేస్తున్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిలి డాక్టర్‌ని తీసేసి ప్రైవేటును ప్రోత్సహిస్తున్నారు. ఇది తీవ్రమైన నష్టం కలిగించే అంశం

– ఐతి ఈశ్వరరావు, పురుషోత్తపురం, పలాస

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల మొక్కలను నాటారు. మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని చెబుతూ అవగాహన ర్యాలీలు చేపట్టారు. మొక్కలు నాటడంతో పాటు సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్



మందస: అవగాహన ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు



టెక్కలి: కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న న్యాయవాదులు



కంచిలి: రాధాకృష్ణ ఆలయంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు



కాశీబుగ్గ: మొక్కలు నాటుతున్న రామానంద స్వామిజీ



టెక్కలి: కోటబొమ్మాళి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మొక్కలు నాటుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి



టెక్కలి: ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో మొక్కలు నాటుతున్న డైరెక్టర్ నాగేశ్వరరావు



పలాస: మొక్కలు నాటుతున్న గ్రీన్ ఆర్మీ ప్రతినిధులు, వైద్య సిబ్బంది



ఇచ్ఛాపురం: ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ రమేష్



కవిటి: బెలగాంలో మొక్కలు నాటుతున్న డిప్యూటీ ఎంపీడీవో అబ్దుల్ హక్ తదితరులు



సోంపేట: ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది



కాశీబుగ్గ: కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న జడ్జి మాధురి



సోంపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం



సంతబొమ్మాళి: మొక్కలు నాటుతున్న జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య



మందస: మొక్కలు నాటుతున్న ఎంపీడీవో వెంకటరమణ తదితరులు



ఇచ్ఛాపురం రూరల్: టి.బరంపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ పుష్ప తదితరులు



ఇచ్ఛాపురం టౌన్: మొక్కలు అందజేస్తున్న సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి



కంచిలి: కర్రలి గ్రామంలో చెరువు వద్ద మొక్కలు నాటుతున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు



వెన్నుపోటు నిరసన కార్యక్రమానికి హాజరైన పలాస నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కాశీబుగ్గ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన వెన్నుపోటు దినం విజయవంతం అయ్యిందని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకతతో పాటు జగన్‌మోహన్‌రెడ్డిపై విశ్వాసంతో సాధారణ ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తరలి వచ్చారన్నారు. పలాస నియోజకవర్గంలోని పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాలతో పాటు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ నుంచి హాజరైన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.



• ప‘రేషన్’

కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను తొలగించడంతో రేషన్ లబ్ధిదారులకు కష్టాలు తప్పడం లేదు. ఇదివరకు వీధుల్లోకి వాహనంతో వచ్చి రేషన్ సరుకులు ఇచ్చేవారు. కానీ ఇప్పుడు రేషన్ సరుకుల కోసం డిపోల వద్ద పనులు మానుకుని పడిగాపులు కాయాల్సి వస్తోందంటూ లబ్ధిదారులు వాపోతున్నారు. గురువారం టెక్కలి రోటరీనగర్ రేషన్ డిపో సమయానికి తెరవకపోవడంతో లబ్ధిదారులు ఆపసోపాలు పడ్డారు.

– టెక్కలి

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ చల్లదనం

కవిటి: మండలంలోని పుటియాదళ పంట పొలాల్లో వెలసిన ఎల్లమ్మ అమ్మవారికి వివిధ గ్రామాల భక్తులు గురువారం చల్లదనం ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కవిటి ఉషోదయ సంఘం ఆధ్వర్యంలో మేళతాళాలతో అమ్మవారి ఊరేగింపు యాత్ర నిర్వహించి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్య లో భక్తులు పాల్గొన్నారు.